# కొడుకు ఏనాటికీ అత్తే



సూర్యుడు తూర్పు దిక్కునే ఉదయిస్తాడు... పశ్చిమ దిక్కున అస్తమిస్తాడు. సూర్యుడి రాకపోకలు మారవు గాక మారవు. అత్తాకోడళ్ళలో ఉండే సఖ్యత కూడా అంతే నిజం.

"ఆమెగారు... అదే... మీ అమ్మగారు... ఆరోగ్యం బాగోలేదంటూ కూచున్న చోటు నుంచి కదలదు. అలాంటి స్థితిలో ఈ రోజు ఎవరిదో పెళ్ళంటూ పది కిలోమీటర్లు ఆటోలో పోయి వచ్చిందండీ... మామూలు వాళ్ళకే వొళ్ళు హూనం... దారిలో ఏదైనా జరిగితే.... మూలబడి మంచమెక్కితే, నా పని ఖతం. ఈవిడ పోనంత మాత్రాన పెళ్ళి ఆగిపోతుందా?... అదేంలేదుకదా... అటువంటప్పుడు ఈ రిస్క్ ఎందుకు? నేనిప్పుడే చెప్పేస్తున్నా... మీ అమ్మగారికేమైనా జరిగి కదల్లేని పరిస్థితొస్తే నాకు అంటగట్టొద్దు సుమా... మీరామెకి ఏం చెప్పుకుంటారో ఏమో... అయినా అందరిలాగా అత్తగారి పొత్తు పనికిరాదన్నానా? ముసలోళ్ళ ఆశ్రమంలో వొదిలెయ్యమంటున్నానా?... ఎక్కడికి పడితే అక్కడికి తిరిగొచ్చే ఓపిక ఇంట్లో ఉన్నంతసేపూ ఏమవుతుందో?" అంటూ ప్రశ్నలూ, సంశయాలూ ఏకధాటిగా వెళ్ళ బుచ్చిన భార్యవైపు మౌనంగా చూస్తుండిపోయాడు సూర్యం.

కొంతమంది గుండెల్లో వున్న కలుషితాన్ని సమయం చూస్కొని ఎదుటివాళ్ళ మీద కొద్దికొద్దిగా పులుముతుంటారు. ఆడవాళ్ళల్లో సఖ్యత, సర్దుబాటు ఉంటే ప్రతికుటుంబం కళకళలాడ్తుంది. సాటి స్త్రీ గురించి ఒక స్త్రీ ఇంత అల్పంగా ఆలోచించడంలో అర్థం, పరమార్థం ఏమిటి? మనసుని చక్కటి ఆలోచనల్తో నింపుకోగలిగిన స్త్రీ ఆరాధనీయమని అందరూ అనే మాటే... అందరికీ తెలిసిన సంగతే... అయినా ఎందుకలా నడుచుకోలేకపోతున్నారు? ఆ లోపం ఎక్కడుంది?

కొన్నికొన్ని మాటలు వినకూడదనుకొని, విన్నా మాట్లాడకూడదనుకొని 'చెవుడు' అనే ఆయుధాన్ని ధరించింది ఆ అత్త. ఎప్పటిలాగే ఆరోజు కూడా కోడలు కొడుకుతో చెప్తున్న మాటలు చెవిన పడ్తున్నా నిస్పృహగా తనలో తనే నవ్వుకొని సరిపెట్టుకొంది. తనకి శ్రమ అని తెలిసినా ఆటోలో పది కిలోమీటర్లు ఎందుకు వెళ్ళిందో కోడలికేం తెలుసు? తెలిసినా అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తుందా? ప్రయత్నించేదైతే తననే అడిగి ఉండొచ్చు కదా... నేరాన్ని వెతికి పట్టుకున్నట్టు భర్తకు చెప్పడం ఎందుకు? భర్త తనకు వంత పాడితే భార్య పొందే ఆనందం అంతాయింతా కాదు... కోడలి ముఖంలో అది కన్పడుతూనే వుంది.

తను ఎవరింట్లో పెళ్ళికయితే వెళ్ళొచ్చిందో వాళ్ళు... ఒకప్పుడు ఇల్లు కాలిపోయి దిక్కులేని వాళ్ళలా తమ ఇంటికొస్తే తనూ, తన భర్తా వాళ్ళను ఓదార్చి, ఆదుకున్నందుకు ఇంటిల్లిపాదీ ముఖాల్లో కృతజ్ఞతతో మెరిసిన మెరుపుని మర్చిపోలేకపోయింది. అదీగాక వాళ్ళంతా తను విధవరాలైనా తన ఆశీస్సులకోసం పాకులాడ్డం, పెళ్ళికి వచ్చినందుకు దేవతే దిగొచ్చినంతగా సంబరపడ్డం... పెళ్ళిలో తననెంతో గౌరవించడం... ఇంతకంటే జీవితానికేంకావాలి? ఎదుటివాళ్ళు మనల్ని మంచివాళ్ళు అని పొగిడేప్పుడు, అభిమానించేటప్పుడు... తెలీకుండానే సంతృప్తి కలుగుతుంది. అందుకే ఈరోజు పెళ్ళికి వెళ్ళొచ్చింది తను.

ముసలివాళ్ళయినంతమాత్రాన గుర్తింపు ఉండకూడదా? కొడుకు, కోడలికీ తెలియకుం

**దోర్నాదుల సుబ్బమ్మ**

డా నిర్ణయాలు తీసుకోకూడదా? భర్త పోయాక పదిలక్షల రూపాయలు కొడుకు చేతికిచ్చింది. ఓ రెండు లక్షలు తన సేవింగ్స్‌లో ఉంచుకొంది. అయ్యో అన్పించే దీన స్థితిలో ఉన్నవారికి స్వతంత్రంగా పది రూపాయలిస్తుంది. అలాంటివి కోడలి కంటపడినప్పుడల్లా ముఖం చిట్లించుకొంటుంది. చిలువలు పలువలు చేర్చి, భర్త వద్ద ప్రస్తావించినప్పుడల్లా ఆ కొడుకు వినీ విననట్లుంటాడు. "అమ్మ ఇష్టం వొచ్చినట్లు చేస్కోనివ్వు..." అని అప్పుడప్పుడూ భార్యకు సర్దిచెప్తుంటాడు.

ఆ మాటతో భార్య గయ్‌మంటూ "ఔను మరి! మీకు కోట్లకు కోట్లు ఆస్తిఉందికదా... పోతేపోనీ అనుకోవడానికి... మా బంధువుల్లో అందరికీ బంగళాలూ, కార్లు!... ఆ సౌకర్యాలన్నీ మీరు కూడా ఓ రోజుకి మనకూ సమకూరుస్తారని సరిపెట్టుకుంటూ వస్తున్నాను. అమ్మకు అడ్డు చెప్పే దమ్ము మీకు లేదాయె..."

ఎప్పుడూ ఈ చివరివాక్యం అత్తగారు వినేట్టుగా మాట్లాడటంవల్లే... ఆ అత్తగారు 'చెవుడు' అనే దాన్ని అంటగట్టుకుంది. అడిగిందే అడగడం, చెప్పిందే మళ్లీ చెప్పించుకోవడం... పెద్దగా చెప్పమనటం అలవాటు చేసుకుంది.

తనకు వయసుతోపాటు చెవుడు వచ్చేసిందని కొడుకు, కోడలూ నిర్ధారించుకున్నా తననుకున్న ప్రకారం జరిగిందని ఓ విధమైన తృప్తితో వుండిపోయేది. లేనిలోపం అంటగట్టుకోవడం వల్ల ఇంట్లో ఏ పేచీలూ రాకుండా జరిగిపోతోంది. అయినా కొన్ని మాటలు మనసుకు గుచ్చుకొని కళ్ళల్లోకి నీళ్లు తెప్పించేవి. తనకు తనే నచ్చచెప్పుకొని గుటకమింగి గుండెలోకి నెట్టుకునేది.

పిల్లల్ని వెంటబెట్టుకొని కోడలు పేరంటాని కెళ్ళింది. కొడుకు ఆఫీసు నుంచి రాగానే టీ ఇచ్చింది ఆమె. కొడుక్కి దగ్గరగా కుర్చీలాక్కుని కూర్చుంది. తల్లీ కొడుకులు ఒకర్నొకరు చూస్కుంటూ మౌనంగా ఉండిపోయారు. కొన్నిసార్లు మౌనం ఊరటనిస్తుంది.

'నీగురించి నీ కోడలు చెప్పేవన్నీ వింటున్నానేగానీ... నీ మనసు నాకు తెల్సుకాబట్టి ఎప్పటికీ అపార్థం చేసుకోనమ్మా... నీపై నేరం మోపినా ఖండించలేని అసహాయత నాది. నన్ను క్షమించమ్మా. సంసారం సఖ్యతగా ఉందనిపించుకోవాలనే నా ప్రయత్నం..." అంటూ తప్పు చేసి సంజాయిషీ యిచ్చేవానిలా కొడుకు చూపుల్ని చూడలేక తల పక్కకు తిప్పుకొంది. తప్పుని ఒప్పుకోవడం కూడా గొప్పదనమే.

నాకు తెల్సురా నీ మనసు... సంసారం గుట్టు రట్టు కాకుండా ఉన్నంత వరకే దాని గొప్పతనం. నా మూలంగా గొడవలు రాకూడదనే చెవిటిమనిషిగా ఉండిపోయానని చెప్పబోయి ఆగిపోయింది. ఒకవేళ తనకు చెవుడు లేదని చెప్పేస్తే... కోడలు చేసే రాద్ధాంతమంతా అమ్మ మనసులోనే దాచుకుందన్న సంగతి తెలిస్తే... కొడుకు తన గురించి మరింత బాధపడ్తాడనిపించింది.

ఎదుటి వారు బాధపడే కారణాలు స్ఫురించినప్పుడు తప్పించడానికే ప్రయత్నిస్తారు చాలామంది. కొంతమంది మాత్రం ఓ పుల్ల

"ఓ వంద రూపాయలు అప్పు ఇవ్వండి - ఒకటో తారీఖున ఇచ్చేస్తాను" భర్తని ముద్దుగా అడిగింది భార్య.

"ఎలా తీరుస్తావ్?" అడిగాడు భర్త.

"ఏం... ఒకటిన మీకు జీతం రాదా?" తిరిగి ప్రశ్నించింది భార్య.




ఎక్కేసి, తగువుచూసి, సంతోషపడ్డారు. తను అలాంటిది కాదు గనుకే మౌనంగా ఉండిపోయింది.

ఎదురుగా చెట్టువైపు చూస్తున్న కొడుకుని చూసి తనే మొదలు పెట్టింది. "పండుటాకు ఎప్పటికైనా రాలిపోయేదే. రాలిపోతే కొమ్మకూ తేలికౌతుంది. ఏమైనా పదికాలాల పాటు ఆకులు, చివుర్లతో కొమ్మ పచ్చగా ఉంటుంది. సృష్టి ధర్మమే అంత...! పండుటాకు కూడా కొంత కాలం కొమ్మకు పచ్చదనాన్నిచ్చి రాలిపోయినా, మరలా ఆ చెట్టుకి ఎరువుగా మారాలని ఆశ పడ్తుంది. మనిషీ అంతే!" అంటున్న తల్లివైపు చూసాడు.

అమ్మ భావగర్భితంగా మాట్లాడ్తోందని తెలుస్తూనే ఉంది. అసలింతకూ అర్థం ఏమై ఉంటుంది? ఆలోచనలో పడ్డాడు ఓ నిమిషం సేపు. తళుక్కున మెరిసింది అమ్మ మాటల్లో అర్థం.

"కోడలూ ఓనాటికి అత్తే అవుతుందమ్మా"

ఉపశమనంకోసం అన్నాడు. ఉన్న సంగతి అదేకదా అన్నట్టు చూసాడు. కసి, బాధ, నిస్సహాయత... మూడూ ముడిపడివున్న కొడుకు ముఖాన్ని చూసేసరికి తల్లిపేగు కళపెళలాడింది.

"నా సంతృప్తికోసం నువ్వలా మాటాడొద్దు నాన్నా. ఏ వేళ ప్రభావం ఎలా ఉంటుందో... నా పరిస్థితి నా కోడలికి రాకుండా ఉండాలనే ఆశపడ్తున్నాను. తన బాధ ఇతరులు కూడా పడడం చూసి కొంతమంది సంతోషపడతారు. నేనలాంటిదాన్నా...?"

"అమ్మా...!" ఆ పిలుపు అంతరంగంలో నలుసంత కల్మషానిక్కూడా చోటివ్వనని మాట ఇచ్చినట్లుగా ఉంది.

అమ్మ నవ్వింది... ఆ నవ్వు మాతృత్వం పక్షం నిలిచి, వక్షస్థలాన్ని చీల్చి కొడుకు మీదున్న మమకారాన్ని చూపెట్తోంది.